

కోతలు వాయిదా వేసుకోండి

జంగారెడ్డిగూడెం: వచ్చే నాలుగు రోజులు వర్షాలు పడతాయనే హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి పోశారావు సూచించారు.



ఘనంగా శ్రీచక్రస్నానం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీచక్రస్నానం ఘనంగా నిర్వహించారు.



టీడీపీ, జనసేనకు రాంరాం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మేడపాడు వీఓఏపై వేటు



టీడీపీ ఎన్నికల ప్రచారంలో రాజ్యలక్ష్మి

భీమవరం: ఎన్నికల నియామళికి విరుద్ధంగా తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యలమంచిలి మండలం మేడపాడుకి చెందిన వీఓఏ చల్లా రాజ్యలక్ష్మిని విధుల నుంచి తొలగించాల్సిందిగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యలక్ష్మి ఇంటింటా టీడీపీ మేనిఫెస్టోను పంచుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఏజెంట్ నిమ్మకాయల రామకృష్ణ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అనంతరం రాజ్యలక్ష్మిని తక్షణం విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

18 నుంచి జాతీయ నాటిక పోటీలు



నాటిక పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం కళారంజని నాటక అకాడమీ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు జాతీయస్థాయి తెలుగు నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరధీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. 18న గుంటూరు ఆర్ట్స్ (అమరావతి) వారు అమృతహస్తం, భద్రం ఫౌండేషన్ (విశాఖ) వారు మట్టి పరిమళం, 19న నటీనట సమాఖ్య (పాలకొల్లు) వారు అనూహ్యం, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారు క్షేత్రం, శ్రీశిరిడిసాయి కల్చరల్ క్రియేషన్స్ (అనకాపల్లి) వారు మలిసంధ్య, 20న వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ (వెలగలేరు) వారు రాత, శ్రీకరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ (గుంటూరు) వారు నాలోన నీవే నాటికలు ప్రదర్శిస్తారన్నారు. అలాగే కళాకారులు కోనేటి సుబ్బరాజు, ఎస్.డేవిడ్‌రాజు, బాలగోపాల త్రిమూర్తిరాజు, పోలుదాసు శ్రీనివాసరావు, కె.సరిత, రావూరి యోగాంబికను సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవాధ్యక్షుడు నల్లం వెంకటకృష్ణ నాగేశ్వరరావు, కార్యదర్శి మెంటే పూర్ణచంద్రరావు, మల్లుల సీతారాంప్రసాద్, పి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ విజయవంతం



సుమిత్‌కుమార్, కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్): రెండు రోజులుగా నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత ఆర్వోలను అభినందించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో రెండు రోజులుగా ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందించారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గాల ఆర్వో కార్యాలయాల వద్ద నిర్వహించే పోస్టల్ బ్యాలెట్‌ను విజయవంతం చేయాలన్నారు. వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా షామియానాలు, కుర్చీలు, తాగునీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి ఓటును వినియోగించుకునే వారికి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. వెబ్ కాస్టింగ్‌ను పక్కగా నిర్వహించాలన్నారు. ఓటర్లకు ఎపిక్ కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర రావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు మరో అవకాశం

ఎన్నిక సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది బుధవారం కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఫారం-12ను సమర్పించి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు.

గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీ జీఎల్ఐ పాలసీదారుల ఫిర్యాదుల స్వీకరణ గడువును ఈనెల 31వ వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు.

'నేను నిజాయతీపరుడిని.. నాకు పక్కవాడిది రూపాయి కూడా అక్కర్లేదు.. కష్టపడి సంపాదించి ఈ స్థాయికి చేరాను..' ఇవీ తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో రోజూ చెబుతున్న మాటలు. అయితే ఆయన అసలు స్వరూపం మరోలా ఉంది. బొలిశెట్టి శ్రీనుకు నియోజకవర్గంలో మరో పేరు ఉంది.. అదే రచ్చ శీను. దుందుడుకు స్వభావంతో ఇతరులను దబాయించడం, తీవ్రస్థాయిలో భయాందోళనలకు గురిచేయడంలో సిద్ధహస్తుడిగా పేరొందారు. లారీ ఫీల్డ్‌తో మొదలు పెట్టి 30 ఏళ్లలో తాడేపల్లిగూడెంలో సంపన్నుడిగా మారారు. సెటిల్‌మెంట్లతో ప్రారంభమైన ప్రస్థానం రాజకీయ పార్టీ అభ్యర్థి వరకు సాగిందిలా..

రచ్చ శ్రీను కేరాఫ్ గూడెం



బొలిశెట్టి.. భయపెట్టి..

- సెటిల్‌మెంట్లు, అక్రమ రవాణాల్లో అందె వేసిన చేయి
- లారీ ఫీల్డ్‌తో మొదలై సంపన్నుడిగా మారిన వైనం
- బియ్యం అక్రమ రవాణా, కల్తీ కందిపప్పులో సిద్ధహస్తుడు
- మున్సిపల్ చైర్మన్‌గా సరికొత్త దోపిడీకి తెరతీసిన వైనం
- 30 ఏళ్లు.. మూడు రాజకీయ పార్టీలు
- పెండింగ్‌లో మూడు కేసులు.. ముగిసినవి మరెన్నో..
- తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థి చరిత్ర ఇదీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: బొలిశెట్టి శ్రీనివాస్‌ను తాడేపల్లిగూడెంలో రచ్చ శీనుగా పిలుచుకుంటారు. 30 ఏళ్లలో కోట్ల సంపద సృష్టించారనేది ప్రచారం. వాస్తవంలో మాత్రం భూ సెటిల్‌మెంట్లతో మొదలుకొని అభివృద్ధి పనుల్లో పర్సంటేజీల వరకు దండుకుని ఎదిగారనేది అందరికీ తెలిసిన సత్యం. వీటన్నింటితో పాటు జూద కళల్లో ప్రావీణ్యం కూడా ఉందనేది గూడెం ఎరిగిన నిజం. 1981లో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్థానం మొదలుపెట్టి, 1999లో మున్సిపల్ కౌన్సిలర్‌గా, ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆ తరువాత 2014లో టీడీపీలో చేరి మున్సిపల్ చైర్మన్‌గా ఐదేళ్ల పాటు పనిచేసి 2019లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఈసారి ఎన్నికల్లో మళ్లీ అదే పార్టీ నుంచి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

బియ్యం అక్రమ రవాణా : సామాన్య కుటుంబం నుంచి వచ్చిన బొలిశెట్టి క్లాస్ వన్ కాంట్రాక్టర్ అని చెప్పుకుంటారు. కౌన్సిలర్‌గా ప్రారంభమైన నాటి నుంచే భూ సెటిల్‌మెంట్లలో అందె వేసిన చేయి. **లెక్కకు మించి భూ సెటిల్‌మెంట్లు, చౌకగా భూములు కొనడం, భారీగా అమ్మడంతో ఆర్థికంగా ఎదిగారు. అక్కడి నుంచి సివిల్ సప్లయిస్‌కు లారీల కాంట్రాక్టర్‌గా, గన్నీ బ్యాగ్ సప్లయర్‌గా, కందిపప్పు సప్లయర్‌గా** మారి భారీగా అవకతవకలకు పాల్పడ్డారు. బియ్యం అక్రమ రవాణా, కందిపప్పు కల్తీలో సిద్ధహస్తుడిగా పేరొందారు. కట్ చేస్తే.. ఒకే లారీకి నంబర్ ప్లేట్లు మార్చి రవాణా చేయడం, అక్రమ బియ్యం సరఫరా వ్యవహారంలో కత్తిపూడి వద్ద లారీలను పట్టుకోగా కేసు నమోదైనట్టు సమాచారం. ఈ పరిణామాల క్రమంలో ఆయన లైసెన్స్‌లను బ్లాక్ లిస్టులో పెట్టడంతో బావమరిది పేరుతో మరో లైసెన్స్ సృష్టించి దానిపై ఇదే వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగించారు. ఈ పరిణామ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాలో బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి కేసు కూడా నమోదై ముగిసిపోయింది.

బినామీ కాంట్రాక్టర్లతో భారీగా దండుకొని..

తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ నిధులతో పార్కుల నిర్వహణ, డ్రెయిన్ల పూడికతీత, ఇతర అభివృద్ధి పనులన్నీ బినామీ కాంట్రాక్టర్లతో చేయించి భారీగా దండుకున్నట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీలో ఎల్ఈడీ లైట్ల కొనుగోలు టెండర్‌లో రూ.5 కోట్ల అవినీతికి పాల్పడ్డారని, అప్పట్లో పట్టణమంతా చర్చ సాగింది. 20 ఎకరాల లేఅవుట్‌లో పది శాతం కమీషన్, పట్టణంలోని అనధికారిక లేఅవుట్‌లో 25 శాతం వాటాలు, దళితులకు చెందిన అసైన్డ్ భూమి స్వాహా చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

పేకాటలో సిద్ధహస్తుడు

బొలిశెట్టికి ప్రవృత్తి రీత్యా ఇష్టమైన క్రీడ పేకాట. 2010లో పేకాడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొద్దిరోజులు పేకాట క్లబ్‌లు నడిపారనే ఆరోపణలు ఉన్నాయి. పేకాటకు సంబంధించిన కేసు విషయాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనే ధ్రువీకరించారు. 2010లో క్రైమ్ నం.169 పట్టణంలోని ఒక రెసిడెన్సీలో పేకాడుతుండగా పోలీసులు దాడి చేసి రూ.26,565 స్వాధీనం చేసుకుని బొలిశెట్టి శ్రీనును ఏ1గా చేర్చారు. 2020లో ఎస్సై, కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించి.. అరెస్టయిన వ్యక్తిని స్టేషన్ నుంచి తీసుకువెళ్లడమే కాకుండా 20 మంది కుర్రాళ్లను పంపి అందరి సంగతీ తేలుస్తానని పోలీసులను బెదిరించిన ఘటనలో క్రైమ్ నం.42తో కేసు నమోదైంది.

తాడేపల్లిగూడెం అభివృద్ధికి మోకాలడ్డు

కాంగ్రెస్ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన క్రమంలో 2014లో తాడేపల్లిగూడెం నుంచి కౌన్సిలర్‌గా గెలిచి బొలిశెట్టి మున్సిపల్ చైర్మన్ అయ్యారు. ఆ సమయంలో ఎమ్మెల్యే పైడికొండల మాణిక్యాలరావు (బీజేపీ) మంత్రి అయ్యారు. కట్ చేస్తే.. మాణిక్యాలరావుకు చుక్కలు చూపించి ఆయన్ను మించి సంపాదించడంతో పాటు ఏ ఒక్క అభివృద్ధి పనీ ముందుకు సాగకుండా ఐదేళ్ల పాటు చేయడంలో బొలిశెట్టి సూపర్ సక్సెస్ అయ్యారు. మంత్రి మాణిక్యాలరావు మంజూరు చేయించిన పనులన్నింటినీ కౌన్సిలర్ తీర్మానం పేరుతో అడ్డుకుని పట్టణ అభివృద్ధిని ఐదేళ్లు వెనక్కి నెట్టారు. ప్రధానంగా మోడల్ ప్రాజెక్ట్‌గా ఏసీ రైతు బజారును మంత్రి మాణిక్యాలరావు గూడెంకు మంజూరు చేయించారు. ఏసీ ఫిష్, నాన్‌వెజ్ మార్కెట్, కూరగాయల మార్కెట్ అన్నీ మున్సిపాలిటీలోని ప్రధాన ప్రాంతంలో ఉన్న ఎకరా స్థలంలో ఏర్పాటు చేయడానికి వీలుగా రూ.9 కోట్ల ప్రాజెక్టు మంజూరైంది. మాణిక్యాలరావుతో ఆధిపత్య పోరు ఉన్న క్రమంలో కౌన్సిల్‌లో తీర్మానం చేసి స్థలం మంజూరు చేయకుండా రూ.9 కోట్ల ప్రాజెక్టును గూడెంకు రాకుండా చేయడంలో బొలిశెట్టి సఫలీకృతులయ్యారు. అలాగే దాదాపు రూ.10 కోట్ల విలువైన రహదారుల పనులకు తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుకున్నారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో మంత్రి పనులన్నింటికీ అడ్డంకొట్టి తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో మాత్రం తన స్నేహితుడి దగ్గర పర్సంటేజ్ తీసుకుని పనులు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి.

చంపేస్తామని మహిళకు బెదిరింపులు

స్థలం అమ్మకపోతే చంపేస్తామని మహిళను బెదిరించిన కేసు కూడా 692/2021గా బొలిశెట్టిపై నమోదైంది. కొయ్యలగూడేనికి చెందిన మార్ని ప్రవీణ అనే మహిళకు గూడెంలోని మోర్ సూపర్ బజార్ ఎదురుగా స్థలం ఉంది. బొలిశెట్టి దానిని తమకు విక్రయించమని కోరితే ఆమె నిరాకరించడంతో రాత్రికి రాత్రే కుర్రాళ్లను పెట్టి సరిహద్దు గోడను పగులగొట్టించి స్థలం అమ్మకపోతే చంపేస్తామని బెదిరించారు. ఈ సంఘటనలో బొలిశెట్టి శ్రీనివాస్ మూడో నిందితుడిగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీని 4వ నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేశారు.

కాపుల సంక్షేమానికి మరింత కృషి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



కాపు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు. చిత్రంలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం

నరసాపురం: నియోజకవర్గంలోని ప్రతి కాపు కుటుంబం మా ఇంట్లో మనిషి ముదునూరి అనిపించునేలా తాను సాగిస్తున్న ఒరవడిని కొనసాగిస్తానని నరసాపురం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం స్థానిక హైవేఇన్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ కాపు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రతి క్షణం ప్రజల అభివృద్ధి, మంచి చేసేందుకు ఆలోచన చేశానన్నారు. వ్యక్తిగత కక్షలకు తన వద్ద చోటులేదన్నారు. మొదటి నుంచి నియోజకవర్గంలో కాపు సోదరులు తనకు అండగా ఉన్నారన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కాగానే కాపుల సంక్షేమానికి మరింత కృషి చేస్తానని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాపు ఉద్యమకారుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ముఖ్యమంత్రికి అత్యంత ఆత్మీయుడైన ముదునూరి ప్రసాదరాజును గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

విజన్ ఉన్న నేత ముదునూరి

ముదునూరి ప్రసాదరాజు అభివృద్ధిపై విజన్ ఉన్న నేత అని మాజీ జెడ్పీటీసీ చాగంటి సత్యనారాయణ అన్నారు. ఆక్వా యూనివర్సిటీ, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, వశిష్ట వంతెన లాంటి ప్రాజెక్టులను పట్టాలెక్కించారన్నారు. కులాల మధ్య చిచ్చుల పెట్టేవారు, సినీనటుల ప్రభావంతో కాపు సోదరులు ముఖ్యంగా యువత వేరే ఆలోచనలు చేయవద్దని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న ముదునూరిని గెలిపించుకోవాలని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ అన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి పవన్ కల్యాణ్ కంకణం కట్టుకున్నారని, ఎవరికో ఊడిగం చేయాల్సిన అవసరం తమకేంటని జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు అన్నారు. కాపుల సంక్షేమానికి జగన్ కృషి చేస్తున్నారని, కాపు ద్రోహి చంద్రబాబు అని, ఇదంతా కాపులు గమనించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాపుల బాగోగులు పట్టించుకున్న మొదటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ అయితే ఆయన తనయుడు సీఎం జగన్ కాపు పిల్లలు, యువత విద్య, కాపు మహిళల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తున్నారని న్యాయవాది పప్పుల రామారావు అన్నారు.

విశేష స్పందన : ఆత్మీయ సమ్మేళనానికి కాపు శ్రేణుల నుంచి విశేష స్పందన వచ్చింది. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కాపులు హాజరయ్యారు. కాపు నేతలు వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, అందే భుజంగరావు, మోటుపల్లి రామ్‌భాస్కర్, కోటిపల్లి దొరయ్య, అడబాల అయ్యప్పనాయుడు, తెన్నేటి గిరి, కౌన్సిలర్లు కావలి నాని, కేసరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోడ దూకే వారికి ఓటేస్తారా?

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

తాడేపల్లిగూడెం రూరల్: ఒక పార్టీలో గెలుపొంది మరో పార్టీలోకి దూకే వారికి ఓటేస్తారా? అని వైఎస్సార్‌సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని కుంచనపల్లి, ఇటుకులగుంట, అమృతపురం, లింగారాయుడిగూడెం, దంగడ్ర, ఉప్పరగూడెం, తాళ్లపాలెం, మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59 నెలల్లో సీఎం జగన్ రూ.2.70 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారని, మరో రూ.80 వేల కోట్లను నాన్ డీబీటీ ద్వారా అందించారన్నారు. గతంలో సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఈ నిధులన్నింటినీ ఎవరికి కట్టబెట్టారని నిలదీశారు. ప్రతిపక్షాలు ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ చట్టాన్ని తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. పవన్ కళ్యాణ్ కాపు అని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉందని, ఆయనకు ఓటేస్తే నేరుగా చంద్రబాబుకు ఓటేసినట్టే అన్నారు. రెండు ఓట్లూ సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ సంఘస్తులంతా ఏకమై తమ సామాజికవర్గ బలాన్నీ నిరూపించాలన్నారు. గతంలో నరసాపురం ఎంపీలు పనిచేసిన వారు గెలిచిన తర్వాత హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో నివాసం ఉండేవారని, తాను భీమవరంలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి కారుమూరి



బ్రాహ్మణ సంఘ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: బ్రాహ్మణ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు మంగళవారం ఇరగవరంలో బ్రాహ్మణ సంఘాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ఇరగవరంలో బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. వంశ పారంపర్య పౌరహిత్యంలో ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పంచముఖి హనుమద్ పీఠాధిపతి తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

భీమవరం అభివృద్ధికి కలిసి నడుద్దాం

ప్రభుత్వ విప్ గ్రంథి శ్రీనివాస్



తూర్పుకాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గ్రంథి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): కులమత, రాజకీయాలకు అతీతంగా భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసి ప్రయాణిద్దామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో మంగళవారం తూర్పు కాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు కాపులకు ప్రభుత్వపరంగా సంక్షేమం అందిస్తూనే రాజకీయపరంగా ప్రాధాన్యమిచ్చామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఓ స్నేహితుడిగా, కుటుంబసభ్యుడిగా అన్నివిధాలా అండగా ఉంటానన్నారు. తూర్పు కాపులకు ఉన్న ప్రధాన సమస్య ఓబీసీ సర్టిఫికెట్ విషయంపై సీఎం జగన్ త్వరలో చర్యలు తీసుకుంటారన్నారు. మరోమారు జగన్ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. భీమవరం జిల్లా కేంద్రం కావాలా, మంత్రి పదవి కావాలా అని అడిగినప్పుడు ప్రజల అభివృద్ధి దృష్ట్యా పదవిని త్యాగం చేసి జిల్లా కేంద్రాన్ని తీసుకువచ్చామన్నారు. శాశ్వత అభివృద్ధి పనులు కూడా చేశామన్నారు. రానున్న రోజుల్లో భీమవరాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. అమలు కాని హామీలు ఇస్తున్న చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. భీమవరం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, గూడూరి జగదీష్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, గనిరెడ్డి త్రినాథ్, జగ్గురోతు విజయ్, అంబల్ల శివ, ముల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను అడ్డుకోవడం చంద్రబాబు నైజం

ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు



కాళ్ల: పేదలను ఇబ్బంది పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని.. ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టుకుని మహిళలు, రైతులు, విద్యార్థులకు అందాల్సిన పథకాలను అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలని మండిపడ్డారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని ఇప్పటికే అడ్డుకున్నారని, ఇప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మహిళలకు ఆసరా, చేయూత, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ రానీయండా అడ్డుపడ్డారన్నారు. దీంతో రైతులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పేదలు ఎదగడం చంద్రబాబుకు ఇష్టముండదని ధ్వజమెత్తారు. జగన్ మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఉండిలో టీడీపీ కంచుకోట బద్దలు కొడుతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రలోభాలకు లొంగి కొందరు నాయకులు పార్టీని వీడుతున్నారని వీడిన వారి వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని, నియోజకవర్గ ప్రజలంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని స్పష్టం చేశారు.

5,233 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోలింగ్



భీమవరంలో పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్)/ఉండి: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మంగళవారం 5,233 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మొదటి రోజు 7,540 మంది, రెండో రోజు 5,233 మంది మొత్తంగా 12,773 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో 13,854 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 1,387, పాలకొల్లులో 2,033, నరసాపురంలో 1,489, భీమవరంలో 2,530, ఉండిలో 1,591, తణుకులో 1,943, తాడేపల్లిగూడెంలో 1,800 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. మిగిలిన వారు 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రం పరిశీలన

భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎల్.నిర్మల్ రాజ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా ఓటర్లకు అందుతున్న సహకారం, ఓటర్ల జాబితాలను తనిఖీ చేశారు. తర్వాత పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళి, బ్యాలెట్ పేపర్లు, కవర్లు పంపిణీ, బ్యాలెట్ బాక్స్ ఏర్పాటును నిశితంగా గమనించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. అర్హులైన వారంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఆయన వెంట ఉన్నారు.

క్లుప్తంగా

11న రేటింగ్ చెస్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

భీమవరం: భీమవరంలో ఈనెల 11న ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మంగళవారం విలేకర్లకు చెప్పారు. బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణమండపంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీల్లో విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఇతర వివరాల కోసం 90632 24466 నంబర్‌లో సంప్రదించాలని కిషోర్ కోరారు.

చైన్‌స్నాచర్లకు రెండేళ్ల జైలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో రెండు ప్రాంతాల్లో జరిగిన గొలుసు దొంగతనం కేసుల్లో నేరం రుజువు కావడంతో ఇద్దరు చైన్‌స్నాచర్లకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ కె.మంగాదేవి మంగళవారం చెప్పారు. 2022లో పట్టణ పరిధిలో గల సబ్బేవారిపేటలో కిరాణాషాపు నడుపుకుంటున్న దేశినీడి సూర్యకుమారి మెడలో నాలుగు కాసులు బంగారు సూత్రాల తాడు, అలాగే 2023లో ముచ్చెర్ల వీరరాఘవమ్మ వరిదనం రోడ్డులో వాకింగ్ చేస్తుండగా ఏడు కాసులు బంగారు సూత్రాల తాడు తెంచుకుని వెళ్లిన సంఘటలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై బాదం శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా వెంపకు చెందిన డి.నాగేశ్వరరావు, బి.వరసత్య లక్ష్మీనారాయణలను అరెస్టు చేసినట్లు తెలిపారు. నరసాపురం కోర్టులో విచారణ అనంతరం జడ్జి కె.శ్రీనివాసరావు నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

భీమవరం అభివృద్ధే నా అజెండా

- భీమవరం జిల్లా కేంద్రం కావాలని మంత్రి పదవినే వదులుకున్నా
- సీఎం జగన్ సహకారంతో దీర్ఘకాల సమస్యలెన్నో పరిష్కరించా
- ఐదేళ్ల పాలనలో సంక్షేమం, సదుపాయాల కల్పనకు పెద్దపీట
- మరిన్ని అభివృద్ధి పనులతో భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం
- 'సాక్షి'తో భీమవరం ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్

ఇంటర్వ్యూ



సాక్షి, భీమవరం: మంత్రి కావాలని ప్రతి ఎమ్మెల్యే కలలుగంటారు. అందుకోసం విశ్వప్రయత్నాలు చేస్తారు. తనకు అమాత్య పదవికంటే నియోజకవర్గ ప్రగతి ముఖ్యమని భావించే నాయకులు చాలా అరుదు. ఆ కోవకే వస్తారు ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్. 'తనను మంత్రి చేయకపోయినా పర్వాలేదు కాని భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయాలని' ఎమ్మెల్యే గ్రంధి కోరిన విషయాన్ని స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం విశేషం. రీల్ హీరో కాదు రియల్ హీరో అంటూ సీఎం ప్రశంసలు అందుకున్నారాయన. అభివృద్ధే నా అజెండాగా నియోజకవర్గాన్ని పట్టిపీడిస్తున్న దీర్ఘకాల సమస్యలెన్నింటినో పరిష్కరించాను. రానున్న ఐదేళ్లలో మరిన్ని పనులు చేపట్టేందుకు భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేశానంటున్న ఎమ్మెల్యే గ్రంధితో 'సాక్షి' ఇంటర్వ్యూ..

సాక్షి : ఈ ఐదేళ్ల పాలన ఎలా సాగింది ?

ఎమ్మెల్యే గ్రంధి : చాలా అద్భుతమనే చెప్పాలి. కనివినీ ఎరుగని సంక్షేమం, అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగాయి. గతంలో ఏ ప్రభుత్వం పేదల కోసం ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది లేదు. పేదలకు మేలు చేయాలని ఇంత లోతుగా ఆలోచన చేసిన ముఖ్యమంత్రి లేరు. తండ్రి కంటే రెండడుగులు ముందుకేసి చరిత్రలో నిలిచిపోయే పాలన అందించి ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

సాక్షి : మీరు గర్వంగా చెప్పుకునే అంశాలు ఏం ఉన్నాయి ?

ఎమ్మెల్యే గ్రంధి : చాలానే ఉన్నాయి. ముఖ్యంగా భీమవరంను జిల్లా కేంద్రం చేయడం. అడగ్గానే కాదనకుండా చేసిన సీఎం జగన్‌కు నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఆధ్యాత్మికత, సంప్రదాయాలకు నెలవుగా, ఆక్వా హబ్‌గా, ప్రశాంతతకు మారుపేరుగా ఇప్పటికే భీమవరానికి మంచి గుర్తింపు ఉంది. జిల్లా కేంద్రంగా మారిన తరువాత ఈ ఖ్యాతి మరింత పెరిగింది. జిల్లా పాలన అంతా ఇక్కడి నుంచే జరగడం ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం అయ్యింది.

సాక్షి : కుటుంబ పరంగా పట్టణాభివృద్ధికి మీరు అందించిన తోడ్పాటు ?

ఎమ్మెల్యే గ్రంధి : పట్టణ అభివృద్ధి కోసం సొంత ఆస్తులు ఇచ్చేందుకు ఎప్పుడు వెనుకాడలేదు. ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.10.40 కోట్లు మంజూరై స్థలం లేక నిధులు వెనక్కిపోయే పరిస్థితుల్లో బాధ్యతగా భావించి ప్రజల కోసం నాలుగు ఎకరాలు మా సొంత స్థలం ఇవ్వగా ప్రస్తుతం ఆస్పత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థలం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాల తరలివెళ్లిపోయే పరిస్థితుల్లో 35 సెంట్ల స్థలం ఇచ్చి కళాశాల నిర్మాణం చేయించాం.

సాక్షి : మీరు పరిష్కరించిన దీర్ఘకాల సమస్యలు ఏమిటి ?

ఎమ్మెల్యే గ్రంధి : పట్టణంలో అతిపెద్ద సమస్యగా ఉన్న కంపోస్టుయార్డు కోసం 6.6 ఎకరాల స్థల సేకరణ చేశాం. సీహెచ్‌సీకి అదనంగా రూ.28 కోట్లు మంజూరు చేయించి ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంపు చేసి పనులు చేపట్టాం. రూరల్‌లోని యనమదుర్రు డ్రెయిన్‌పై గతంలో నా హయాంలోనే మూడు వంతెనలు నిర్మించాం. తర్వాత వచ్చిన పాలకులు కనీసం వాటికి అప్రోచ్ నిర్మాణం చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడంతో వాటికి రూ.36 కోట్లు మంజూరు చేయించి టెండర్ల దశకు తెచ్చాం. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆరు అండర్ టన్నెల్స్ నిర్మించాం. సాంకేతిక అవరోధాలతో పదేళ్ల పాటు ఆగిపోయిన నాగిడిపాలెం బ్రిడ్జిని పట్టువదలకుండా పూర్తి చేయించడం, తాడేరు, ఎల్‌వీఎన్ పురం-గొల్లవానితిప్ప, డేగాపురం, వేంద్ర తదితర చోట్ల వంతెనలు నిర్మించాం. భీమవరంలో 126 ఎకరాలను భూమిని సేకరించి రూ.9 కోట్లతో 62 ఎకరాల్లో మంచినీటి చెరువును తవ్వించాం, సోమగుండం చెరువు అభివృద్ధి చేశాం. పట్టణంలో యనమదుర్రు డ్రెయిన్‌పై రూ.9 కోట్లతో బైపాస్ బ్రిడ్జి నిర్మించి మార్కెట్ వరకు రోడ్డు వేయించాం. మల్టీప్లెక్స్ ముందు కబ్జాదారుల కోరల నుంచి ఆర్అండ్‌బీ స్థలానికి విముక్తి కలిగించి ప్రజలకు పార్కింగ్ ఫీజుల భారం లేకుండా చేశాను. పేదల సొంతింటి కల సాకారానికి నియోజకవర్గంలో 316 ఎకరాలు సేకరించి లబ్ధిదారులకు అందజేసి ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నాం.

సాక్షి : గ్రామాల అభివృద్ధికి తీసుకున్న చర్యలు ?

ఎమ్మెల్యే గ్రంధి : గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా 34 సచివాలయాలు, 18 రైతు భరోసా కేంద్రాలు నిర్మించాం. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు నియోజకవర్గం వ్యాప్తంగా ఏడు సబ్‌స్టేషన్లు నిర్మించాం. రూరల్‌లోని ఎల్‌జీ పాడు పంటకాలువను శివారు గ్రామం వరకు స్వచ్ఛమైన తాగు, సాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రిటైనింగ్ వాల్ నిర్మించాం. భీమవరం, వీరవాసరం మండలాల్లో ఇంటింటికి రక్షిత నీటిని అందించేందుకు రూ.64 కోట్లతో పైప్‌లైన్ పనులు చేయిస్తున్నాం.

సాక్షి : ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది ?

ఎమ్మెల్యే గ్రంధి : చాలా బాగా జరుగుతోంది. పార్టీ క్యాడర్, బూత్ కన్వీనర్లు, నా కుటుంబ సభ్యులు ఎవరికి వారు డోర్ టూ డోర్ ప్రచారం చేస్తున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. నియోజకవర్గంలో ఎక్కడకు వెళ్లినా బాగా ఆదరిస్తున్నారు.

సాక్షి : అభ్యర్థిగా మీరు ప్రజలను కోరేది ?

ఎమ్మెల్యే గ్రంధి : భీమవరం ప్రజలు విజ్ఞులు. పూటకో పార్టీ మారుతూ ఎన్నికల ముందు మాత్రమే కనిపించే కూటమి అభ్యర్థి ప్రజలకు ఎంతవరకు పనిచేస్తారో ఆలోచన చేయాలి. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన ఆయన ప్రజలు కోవిడ్‌తో విలవిల్లాడుతుంటే ఏమైపోయారో ఆలోచించాలి. ఆ సమయంలో నిత్యం ప్రజల్లో ఉండి వారికి భరోసా కల్పించడంతో పాటు ఆక్సిజన్ లేక ఇబ్బంది పడుతున్న సమయంలో 75 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు సమకూర్చి అండగా నిలిచాను. నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించాలని కోరుతున్నాను.

సాక్షి : నియోజకవర్గ అభివృద్ధికి మీ భవిష్యత్ కార్యాచరణ ?

ఎమ్మెల్యే గ్రంధి : పట్టణంలోని ఫుట్‌బాత్ బ్రిడ్జి పక్కన మరో బ్రిడ్జిని నిర్మించడం. వీరవాసరం-నవుడూరు, కుముదవల్లి-పాలకోడేరు, ఉండి రోడ్డు, బైపాస్ రోడ్డులోని రైల్వే గేట్ల వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల నిర్మాణానికి ఇప్పటికే చర్యలు చేపట్టాం. తోక్కోడు డ్రెయిన్ ముంపు సమస్య పరిష్కారానికి మత్స్యపురి సమీపంలోని తూరల వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం, ఏరియా ఆస్పత్రి, కంపోస్టుయార్డ్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం, అనాకోడేరు రోడ్డుకు స్థల సేకరణ చేసి అభివృద్ధి చేయడం, పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే అమృత్ ఫేజ్-3 పనులు, అలాగే వీరవాసరంలో రూ.14 కోట్లతో డ్రెయినేజీ పనులు త్వరితగతిన పూర్తిచేయడం, పూర్తి స్థాయిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. మరెన్నో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం

పెనుగొండ ప్రచారంలో ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



పెనుగొండ ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని, రోజురోజుకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో అభిమానం పెరుగుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం పెనుగొండ డాక్టర్ వైఎస్సార్ కూడలి నుంచి, కంచికామాక్షీ ఆలయం, గాంధీ బొమ్మల సెంటర్, రాజీవ్ సెంటర్, బీసీ కమ్యూనిటీ హాల్, సిద్ధాంతం రోడ్డు, దుర్గమ్మ ఆలయం కోటిపల్లి వారి వీధి, శ్రీరామ్ నగర్, జవ్వాది వారి వీధి, వేంద్రవారివీధిలో ఎన్నికల శంఖారావం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు విజయానికి శ్రీరామరక్షగా నిలుస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు వరకూ సంక్షేమ పథకాలతో ఏపీ శ్రీలంకగా మారిపోతుందంటూ చంద్రబాబు, వారి దత్తపుత్రుడు ప్రచారం చేశారని, అయితే నేడు వారి మేనిఫెస్టోలో సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే కొత్త పథకాలుగా ప్రకటించి మరింత మెరుగ్గా చేస్తామనడం ప్రజల మభ్యపెట్టడమేనని ప్రజలు గ్రహించారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగింపునకు సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండడానికి రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపైనే వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం పెనుగొండలో జోరు వర్షంలో ప్రచారం నిర్వహించగా, ప్రజలు శ్రీరంగనాథరాజుకు పూలవర్షం కురిపించారు. వర్షంలోనే నాయకులు, కార్యకర్తలు ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టరు కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు (నానాజీ), ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), జెడ్పీటీసీ పోడూరి గోవర్దన రామయ్య, ఉప సర్పంచ్ ఆకెశెట్టి వరలక్ష్మీ చంటి, ఎంపీటీసీలు మద్దింశెట్టి లక్ష్మీ, తాడి సుబ్బిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎన్నికల పరిశీలకుడు దిరిశాల శ్రీనివాస్, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, బాలం సత్తిరాజు, సుంకర నాగబాబులు, ఏఎంసీ వైస్ చైర్మన్ తానేటి మల్లి, పార్టీ నాయకులు నూలి తాతాజీ, గ్రంధి లక్ష్మీనారాయణ, నౌడు దుర్గారావు, తానేటి రాంబాబు, చెవ్వేటి రాజు, తిక్కిరెడ్డి పవన్, పాలసత్తిరామిరెడ్డి, చరణ్ రెడ్డి, మేడపాటి వీర్రెడ్డి, కుడిపూడి సత్యనారాయణ, నరేంద్ర, బోణం సుబ్రమ్మణ్యం, కాపిశెట్టి మణికంఠ, రాజేష్ నాయుడు, నాగిశెట్టి నరసింహరావు పాల్గొన్నారు.

చంద్రబాబు వల్లే అన్యాయం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



రేలంగిలో జోరు వానలో బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: సజావుగా అందుతున్న సంక్షేమ పథకాలను చంద్రబాబు దుర్మార్గంతో అడ్డుకోవడంతో అవ్వాతాతలకు అన్యాయం జరిగిందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రేలంగిలో మంగళవారం జోరు వర్షంలోనూ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఇరగవరం, అర్జునుడు పాలెం, ఓగిడి గ్రామాల్లో పలు సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. మహిళలు, ఆడపడుచులు పెద్ద ఎత్తున హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజలకు నష్టం తప్ప మంచి చేద్దాం అనే ఉద్దేశం లేని వ్యక్తి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు ప్రజలకు ఏనాడు మంచి చేసింది లేదని, చంద్రబాబు చెప్పాడంటే చేయడని, అదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడని, చెప్పనివి కూడా చేసే మంచి గుణం వైఎస్ జగన్‌ది అన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ ఓటు బ్యాలెట్‌లో 1లో, ఏమ్మెల్యేగా తనది బ్యాలెట్‌లో 4వ నంబర్‌లో ఉంటుందని, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, నాయకులు వెలగల సాయిబాబారెడ్డి, చోడే జోషి, కొత్తపాడు, కె.ఇల్లిందలపర్రు, సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స రామభద్రరాజు, మల్లిరెడ్డి నాగార్జున, మహిళ అధ్యక్షురాలు మెట్ల కిరణ్మయి, నాయకులు పులుపు అనిల్, పులుపు సునీల్, వడ్డే మార్కండేయులు, చేబ్రోలు పెద్దిరాజు, ఘంటా అప్పారావు పాల్గొన్నారు.

గుడాల గోపికి అడుగడుగునా బ్రహ్మరథం





పెనుమర్రులో ప్రచారం చేస్తున్న పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి (ఫైల్), ప్రచారంలో 'ఆడుదాం ఆంధ్ర' దుస్తులతో బాలికలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), అతని భార్య మంగాదేవి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో గడపగడపకు కార్యక్రమం ద్వారా ప్రజలను పరిచయం చేసుకున్న గోపి ఎన్నికల ప్రచారంలో మరింత దూసుకుపోతున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో పట్టణంలో 31 గ్రామాలు, పాలకొల్లు మండలంలో 27 గ్రామాలు, యలమంచిలి మండలంలో 31 గ్రామాలు, పోడూరు మండలంలో 8 గ్రామాల్లోనూ దాదాపుగా ప్రచారం పూర్తి చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో యలమంచిలి మండలంలో గోపి ప్రచారం చేస్తున్నారు. గోపి భార్య మంగాదేవి పాలకొల్లు మండలంలో, నియోజకవర్గ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు యలమంచిలి మండలంలో, టీటీడీ బోర్డు డైరెక్టర్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, అతని భార్య శశికళ పాలకొల్లు మండలంలో, యడ్ల తాతాజీ ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. యలమంచిలి మండలంలో కొందరు వృద్ధులను పలకరించగా, జగనన్న అందించే సంక్షేమం ఇంకెవరు అందిస్తారని చెబుతున్నారు. 'ఉదయాన్నే ఇంటికి వచ్చి వలంటీర్ తలుపు తట్టి పింఛను, ఇంటికే వచ్చి రేషన్, ఇలా ప్రభుత్వ పథకం ఏదైనా సరే వలంటీర్ ఇంటికి వచ్చి అందిస్తున్నారని, ఎవరయ్యా ఇలా అన్నీ ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేది.. మా బిడ్డలే మమ్మల్ని చూడడంలేదు.. జగన్ బాబు లేకపోతే ఈ పాటికి నా జీవితం ముగిసిపోయేది' అంటూ ఓ వృద్ధురాలు తన ఆవేదనను వెలిబుచ్చింది. మా సొంత బిడ్డలకే లేనిది ఓ కుటుంబ సభ్యునిగా జగన్ మమ్మల్ని ఆదుకుంటున్నాడని తెలిపింది. మరి చంద్రబాబునాయుడు పెన్షన్ రూ.4 వేలు ఇస్తానంటున్నాడు కదా మరో వెయ్యి ఎక్కువే వస్తుంది కదా అని ఆ వృద్ధులను ప్రశ్నిస్తే 'నాలుగు కాదు రూ.40 వేలు ఇచ్చినా మాకు అవసరం లేదు. అయినా చంద్రబాబు అమలు చేస్తాడనే నమ్మకం నాకు లేదు. నా జీవితానికి రూ.3 వేలు నగదు, బియ్యం చాలు. జగనే రావాలి జగనే కావాలి. రూపాయికి పావలాకి అమ్ముడుపోయే నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పే నాయకులు మాకు అవసరం లేదు' వృద్ధులు ఘంటాపథంగా చెబుతున్నారు.

జనసేన, టీడీపీకి రాంరాం

వైఎస్సార్ సీపీలో చేరిన కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు



నారినమెరకలో గుణ్ణం నాగబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు



చంటినాయన సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన అన్నవరానికి చెందిన యాదవ వర్గం యువత, కార్యకర్తలు

పెనుగొండ : ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన శెట్టిబలిజ నాయకులు మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించి సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో కంచి భాస్కరరావు, కంచి మాచిరాజు, కడలి రామారావు, కంది కొండయ్య, బొర్రా వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ నాయకుల చేరిక

యలమంచిలి : నారినమెరక గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన నాయకులు వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి జగదీష్ (రాఖీ) ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చడం వలనే అనేక మంది తెలుగుదేశం, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారంతా పాలకొల్లు ఎమ్మెల్యేగా గుడాల శ్రీహరి గోపాలరావు, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు వలవల బాలాజీ, వలవల సత్యధర్మారావు, వడ్డి వసంతం తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇర్రింకి గెద్దయ్య, రాచమళ్ల నాగేశ్వరరావు, తాడి సురేష్, దీపాటి భాను, లింగాల వెంకటరమణ, దిడ్ల సూర్యతేజ, వల్లూరి సన్నిబాబు, తరపట్ల వేణు, పంతకాని వరప్రసాద్, బొడ్డుపల్లి నితిన్, బందుల ప్రవీణ్ (కన్న), తరపట్ల చిట్టిబాబు, పెదపాటి ప్రవీణ్, వడ్డి బాలాజీ, బొర్రా రవి, వడ్డి బాబ్జి ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 30 కుటుంబాలు

నూజివీడు : ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని ఎమ్మెల్యే, నూజివీడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) కోరారు. మండలంలోని అన్నవరానికి చెందిన యాదవ సామాజిక వర్గం యువతతో పాటు 30 కుటుంబాలు చంటినాయన ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమన్నారు. 30కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు వస్తే రాష్ట్రాన్ని దోచుకోవడం చేయడమే కాకుండా రాష్ట్రం 30ఏళ్లు వెనక్కు వెళ్తుందన్నారు. 14ఏళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు గుర్తుగా ఒక్క సంక్షేమ పథకం కూడా లేదన్నారు. ఉన్న పథకాలను నిర్వీర్యం చేయడం, తన వర్గం వారికి దోచిపెట్టడమే చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. గతంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అని చెప్పి చేయకుండా నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడన్నారు. చంద్రబాబు చెప్పేవి సూపర్‌సిక్స్ కాదని, ఆరు మోసాలని వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి రూ.2లక్షల కోట్లు అవసరమని, కాబట్టి చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయరన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు.

క్లుప్తంగా

తణుకులో అల్లూరి శత వర్ధంతి



తణుకులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకు: అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమాన్ని తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసిన బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు కొండా శ్రీనివాస్‌తో పాటు సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు ధనాల అప్పారావు, చింతపల్లి నాగేశ్వరరావు, గొల్లపల్లి అంబేద్కర్, అనుకుల రమేష్, ముప్పిడి సుబ్బయ్య, నాగార్జున పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

తాడేపల్లిగూడెం : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ మంగళవారం కూడా కొనసాగింది. గూడెం నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు మంగళవారం నాటికి 86 శాతం పోలయ్యా యి. మంగళవారం 827 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమ, మంగళవారం రెండు రోజుల్లో 1,800 మంది ఓట్లు వేశారు. మొత్తం 2,078 మంది ఓటర్ల కోసం ఐదు పోలింగ్ బూత్‌లను కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.

'గూడెం'లో ఈదురు గాలులతో వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం 2గంటల నుంచి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో గత పది రోజులుగా ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఈదురు గాలులకు సేదతీరారు. సాయంత్రం 4 గంటల మొదలుకొని ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులు తడిసి ముద్దయ్యాయి. నాలుగు రోజులపాటు ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ
- కుంచనపల్లి, ఇటుకులగుంట, అమృతవరంల్లో ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు



కుంచనపల్లి గ్రామంలో మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మరోసారి నన్ను గెలిపించి, మరోసారి నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని కుంచనపల్లి, ఇటుకులగుంట, అమృతపురం, లింగారాయుడిగూడెం, దంగడర్ర, ఉప్పరగూడెం, తాళ్లపాలెం, మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), మార్లపూడి సుబ్బారావు, వీరమళ్ల వెంకన్న, సర్పంచ్‌లు దండే కనకబాబు, ఎలిపే గాంధీ, ఉండ్రాజవరపు చంద్రిక, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ చైర్మన్లు గుమ్మళ్ల తాతారావు, వెలిశెట్టి నరేంద్రకుమార్, నాయకులు తాడేపల్లి మోషే, కనుపూరి ఉదయభాస్కర్, ఉర్ల నవీన్, చిన్నం సురేష్, ముద్రగడ లలితకుమారి, నీలపాల రామన్న, కారింకి వీర్రాజు, కొట్టు నాగేంద్ర, గుండుమోగుల బలుసులరావు, యాతం సత్యనారాయణ, తారమట్ల శ్రీనివాస్, చిట్టూరి బాపన్న, అడ్డాల గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన వారిని మర్చిపోవద్దు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు



తణుకులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి కోడలు కీర్తి

తణుకు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల మేలు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్, కోడలు కారుమూరి కీర్తి అన్నారు. తణుకు 3వ వార్డులో దిలీప్‌కుమార్, 23, 26 వార్డుల్లో కీర్తి ఎన్నికల ప్రచారంలో పాల్గొని తణుకు అసెంబ్లీ అభ్యర్థిగా కారుమూరి వెంకట నాగేశ్వరరావును, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, డాక్టర్ దాట్ల సుందర రామరాజు, చోడే గోపికృష్ణ, చిట్టూరి రత్తయ్య, శీలం త్రిమూర్తులు, రంభ నాగేశ్వరరావు, వై.రామకృష్ణ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు అండగా వైఎస్సార్ సీపీ

తణుకు టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు ఓట్లేసి గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథంలో పనులు చేస్తున్న వారి వద్దకు వెళ్లి ఆయన ఓట్లను అభ్యర్థించారు. తణుకు ఎమ్మెల్యేగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తేతలిలో వైఎస్రా్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, కోట స్వామీజీ, దారం శ్రీను, భూపతిరాజు రామకృష్ణంరాజు, వలవల కిషోర్, భీమచంద్రరావు, దాసరి అనంద్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ, అభివృద్ధి సాధ్యపడుతుందని పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు తెలిపారు. మంగళవారం పెంటపాడులో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ దాసరి హైమావతి, దేవాబత్తుల నాగమణి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళతో కలిసి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడేపల్లిగూడెం అభివృద్ధికి కొట్టు సత్యనారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కొట్టు సత్యనారాయణ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నల్లమిల్లి అంజిరెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, నల్లమిల్లి గాంధీరెడ్డి, బండారు నాగు, బస్సుల రెడ్డి, ఆడిటర్ దాసరి శ్రీనివాస్, శివారెడ్డి, పాలూరి సాయిరాం, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి బాస్కరరెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఏఎంసీ డైరెక్టర్లు సలుమూరి ప్రకాష్, కర్రి వరహాలరెడ్డి, కర్రి ప్రియాంకరెడ్డి చదలవాడ శ్రీనివాస్, బండారు రాంబాబు, ఉండ్రాజవరపు గోపి, రెడ్డి సంఘ సభ్యులు, నల్లమిల్లి అప్పిరెడ్డి, ఎస్సీ, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

• ఇదీ మార్పు



గ్రామ సచివాలయం



దర్శిపర్రులోని రైతుభరోసా కేంద్రం



పట్టణ ఆరోగ్య కేంద్రం



వెల్‌నెస్ సెంటర్

చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసే అవకాశం లేదు . గ్రామాల్లోను, పట్టణాల్లో సేవలు వాకిట ముంగిటకు చేరువయ్యాయి. గ్రామసచివాలయాల నుంచి మిల్క్ చిల్లింగ్ కేంద్రాలు , ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. ఐదు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సారధ్యంలో మార్పు స్పష్టంగా కనపడుతోంది.రెండు మండలాలలో 47 గ్రామ సచివాలయాలు, 47 ఆర్‌బీకెలు, 34 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటయ్యాయి.

- తాడేపల్లిగూడెం

ఆటో డ్రైవర్లకు అండగా వైఎస్సార్ సీపీ



రేలంగిలో మంత్రి కారుమూరిని అభినందిస్తున్న ఆటో డ్రైవర్లు

ఇరగవరం: ఆటో డ్రైవర్లుకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో మంగళవారం ఆటో డ్రైవర్లు, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆకాంక్షకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లుకు అందరి జీవనోపాధికి భరోసా కల్పిస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మేనిఫెస్టోలో ఉచిత ప్రయాణం లేకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. భవిష్యత్‌లో మరింత మేలు జరిగేలా ప్రతి ఒక్కరి కోసం సీఎం జగన్ మరింత భద్రత కల్పిస్తారు అన్నారు. రానున్న ఎన్నికల్లో మీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తు మీద వేసి ఎమ్మెల్యేగా నన్ను ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, నాయకులు వడ్డే మార్కేండేయులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

తణుకు టౌన్: మండలంలో వడదెబ్బ కారణంగా ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలి మృతి చెందిన సంఘటన తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మండపాక గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న విడివాడ రత్తయ్య మంగళవారం పని చేసే చోటే స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించే లోపే రత్తయ్య మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీనితో సమాచారం అందుకున్న ఎంపీడీవో డీ శ్రీలత, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ శ్యాంకుమార్‌లు మృతి ఇంటికి వెళ్లి మృతుని వివరాలు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, సందర్శించి తమ సంతాపం తెలిపారు.

ముస్లింలకు అండగా జగన్


ఎస్కె నౌషాద్ మోహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివంగత నేత వైఎస్సార్ బాటలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముస్లింలకు అండగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె నౌషాద్ మోహిద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలపై రూ.26 వేల కోట్లు ఖర్చు చేశారని కొనియాడారు. ముస్లింలపై కపట ప్రేమ చూపించిన చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు కేవలం రూ.2,650 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. నేటి ప్రభుత్వం నవరత్న పథకాలే కాకుండా అనేక సంక్షేమాలు ముస్లింలకు అందిచినట్లు చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్న బీజేపీ ముస్లింలలో వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లును రద్దు చేస్తామనడం చాలా అన్యాయమని విమర్శించారు. నెల్లూరు సభలో ముస్లింలకు, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లుకు గాని, సీఏఏ, ఎన్ఆర్సీ, ఇతర ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీతో పొత్తు పెట్టుకొని ముస్లింల విశ్వాసాన్ని కోల్పోయారని, వారికి తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ముస్లింలు అంతా జగన్ వెంటే ఉంటారని, వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించుకుంటామని వెల్లడించారు.

సమస్యలపై నాన్చడం నచ్చదు..

ఉండి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు



ఇంటర్వ్యూ

ఆయన ముక్కుసూటి మనిషి. సమస్యలపై నాన్చివేత ధోరణి ఆయనకు అస్సలే నచ్చదు. కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసి రెండు పర్యాయాలు జాతీయ స్థాయి అవార్డు సైతం సాధించారు. గత ఎన్నికల్లో ప్రజలు తనను గుర్తించకపోయినా.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఐదేళ్లుగా అహర్నిశలు పాటుపడ్డారు. గత పాలకులు ఎవ్వరూ చేయలేని అభివృద్ధి చేసి శభాష్ అనిపించుకున్నారు. పేదోడికి సొంతగూడు కల్పించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చెబుతున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా ఉత్తమ సేవలందించిన తనకు బ్యాంకుల్లో రుణాల కోసం అవకతవకలకు పాల్పడే ప్రత్యర్థి అభ్యర్థి ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ కాదని అంటున్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు ఈసారి తనకు అఖండ విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అంతరంగం.. ఆయన మాటల్లోనే

- ఆకివీడు

సాక్షి: ప్రజాక్షేత్రంలో మీకు ఏ విధమైన గుర్తింపు ఉంది?

పీవీఎల్: ప్రజలు నాపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు. నీతి, నిజాయితీ గల వ్యక్తిగా నన్ను గుర్తించారు. ముక్కుసూటిగా మాట్లాడటం నా నైజం. ఇది ప్రజలకు ఎంతగానో నచ్చింది. సమస్యపై వచ్చే ప్రజలకు అది న్యాయం జరుగుతుందో లేదో వెంటనే చెప్పడం ద్వారా వారిలో మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. రాజకీయంగా నాయకులు ప్రజల సమస్యలను నాచ్చుతూ వస్తారు. అది కరెక్ట్ కాదని నా అభిప్రాయం. అది ప్రజల్ని మోసం చేయడమే.

సాక్షి: రాజకీయ నాయకుడిగా మీ ప్రస్థానం?

పీవీఎల్: నా తండ్రి పీవీఎల్ తిమ్మరాజు 17 సంవత్సరాల పాటు ఆకివీడు సమితి అధ్యక్షుడిగా నీతి నిజాయితీతో సేవలందించారు. ఆయన వారసత్వంతో యండగండి సొసైటీ అధ్యక్షుడిగా 28 ఏళ్లపాటు రైతులకు సేవలందించా. ఎనిమిదేళ్లు సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా పనిచేశాను. ఈ సమయంలోనే జాతీయ స్థాయిలో సొసైటీకి, సొసైటీ అధ్యక్షుడిగా ఉత్తమ అవార్డులు లభించాయి. ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలందించా. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ తరువాత చిరంజీవి ప్రజారాజ్యం పార్టీలో చేరా. అనంతరం మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశా. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా నిజాయతీ, మంచితనాన్ని గుర్తించి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించారు. ఈ ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే అవకాశం ఇచ్చారు.

సాక్షి: గత ఎన్నికల్లో ఓటమికి కారణం?

పీవీఎల్: ప్రజాసేవకు మించిన ఆనందం ఉండదని భావించి గత ఎన్నికల్లో పోటీకి దిగాను. అయితే ప్రత్యర్థి ప్రలోభాలతోపాటు, ప్రజలు నా సేవల్ని గుర్తించలేకపోయారనేది నా అభిప్రాయం. ఎన్నికల అనంతరం ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడ్డాను. అయినప్పటికీ పార్టీకి కట్టుబడే ఉన్నాను.

సాక్షి: ఓడినా.. మీరు నియోజకవర్గంలో సేవలందించారు.

పీవీఎల్: గత ఎన్నికల్లో ఓటమి చెందినా కుంగిపోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నన్ను పిలిచి మంచి వ్యక్తివి, ప్రజలకు సేవలందించు అని ఆదేశించడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశాను. గత 58 నెలలుగా అలుపెరుగని సేవలందించాను. నా సొంత పనులకంటే నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చాను. నియోజకవర్గంలో రూ.311.74 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశాను. పూర్తయ్యే పనులకే కొబ్బరి కాయ కొట్టి, శంకుస్థాపనలు చేయడం నా సిద్ధాంతం. రోడ్లు, డ్రెయిన్లు, ఫిల్టర్ బెడ్‌లు, ఓహెచ్ఎస్ఆర్‌లు, విద్యుత్ సబ్ స్టేషన్లు, వంతెనల నిర్మాణం పూర్తి చేశాను.

సాక్షి: ఈ ఐదేళ్లలో ప్రజల జీవనశైలి మారిందంటారా?

పీవీఎల్: సీఎం వైఎస్ జగన్ అమలు జరిపిన సంక్షేమ పథకాలు ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకువచ్చాయి. ముఖ్యంగా పేద వర్గాల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం, పాఠశాలలు, రైతు, మహిళా సంక్షేమం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది. అన్నదాతల ఆత్మహత్యలే లేవు. ఆడపడుచులు ఆనందంతో జీవిస్తున్నారు. సర్కారు బడులకు, ప్రభుత్వ దవాఖానాలకు వెళ్లలేమని చెప్పే ప్రజలు.. నేడు వాటి కోసం క్యూ కడుతున్నారంటే జగన్ పాలన ఏ విధంగా ఉందో స్పష్టమవుతుంది. మరో పదేళ్లు జగన్ పాలన కొనసాగితే రాష్ట్రంలో ఇంజినీర్లు, డాక్టర్లు, ఉన్నత ఉద్యోగాల్లో కోకొల్లలుగా యువత స్థానం సంపాదిస్తారు.

సాక్షి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎలా అనిపించింది?

పీవీఎల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుజేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతి నాయకుడికీ పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టింది. ప్రజల ముంగిటకు అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లిన సందర్భంలో ప్రజల ఆనందానికి అవధుల్లేవు. వారి సమస్యలు తక్షణం పరిష్కారం కావడంతో ఎంతో సంతోషించేవారు.

సాక్షి: నాలుగు దశాబ్దాల సమస్యను మీరు పరిష్కరించారంట కదా?

పీవీఎల్: అవును. నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక సొంత ఇంటి కల. గత పాలకులు, నాయకులు పేదల సొంత ఇంటికలను ఎండమావిగా చూశారు. ప్రతి ఎన్నికల్లో ఇది వారి వాగ్దానంగా మిగిలేది. రెండు తరాలకు చెందిన వారు సొంత ఇంటి కల కోసం ఎదురు చూసి అశువులు బాసారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత నియోజకర్గంలో 16 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాం. వేలాది మంది సొంత ఇళ్లు నిర్మించుకున్నారు. అద్దె ఇంటి సమస్య, రోడ్ల వెంబడి, శ్మశానవాటికల్లో కాపురాలకు చెల్లుచీటి పెట్టారు.

సాక్షి: నియోజకవర్గ ప్రజల్ని మీరు కోరుకునేది?

పీవీఎల్: నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ పనిచేసిన పాలకులు ప్రజల సమస్యల్ని, గ్రామాల అభివృద్ధిని పక్కనపెట్టారు. దివంగత నేత మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు రూ.800 కోట్లతో అభివృద్ధి చేశారు. సర్రాజుకు ముందు, తరువాత కూడా ఎవరూ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నిత్యం ప్రజల్లో ఉంటూ గడప గడపలో ప్రజల్ని పలకరిస్తూ పనిచేసి, గ్రామాల్లో చాలా సీసీ రోడ్లను నిర్మించాను. ప్రధాన రోడ్లను అభివృద్ధి చేశాను. ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా, ఆక్వా రంగానికి విద్యుత్ సమస్య లేకుండా ఉండేందుకు నాలుగు సబ్‌స్టేషన్లు నిర్మించాను. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడే వ్యక్తులు చేయని పనుల్ని చేసి చూపిన నా సేవల్ని ప్రజలు గుర్తిస్తారని ఆశిస్తున్నా.

జగన్‌కు జైకొట్టిన ఆటో డ్రైవర్లు

తణుకులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


తణుకులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తణుకు అర్బన్: స్వయం శక్తితో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లని గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని భారత మాత ఆటో యూనియన్ కార్యదర్శి కంచుమర్తి విశ్వేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్టీసీ బస్సు డిపో ఎదురుగా ఉన్న భారతమాత ఆటో స్టాండ్ వద్ద మంగళవారం యూనియన్ సమావేశం అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆటో డ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటకలో అమలవుతున్న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 6 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను ఇదే వృత్తిలో ఉంటూ పోషించుకుంటున్నారని.. అందుకే ఈ పథకం వద్దని తాము రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించినా టీడీపీ తమపై కరుణ చూపించకుండా మేనిఫెస్టోలో ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా మొర ఆలకించి అమలుకు సాధ్యం కాని ఆ పథకాన్ని తన మేనిఫెస్టోలో పెట్టకుండా మాకు అండగా నిలిచారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు అందజేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆ మొత్తాన్ని రెట్టింపు చేస్తానని మేనిఫెస్టోలో పెట్టడాన్ని మేమంతా స్వాగతిస్తున్నామని చెప్పారు. సీఎం జగన్‌కు తామంతా అండగా నిలబడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారతమాత ఆటో యూనియన్ సభ్యులు ఎస్.నరసింహమూర్తి, వి.ప్రశాంత్‌కుమార్, కడలి శ్రీను, వి.పిలిప్, కుక్కల బాలాజీ, కుక్కల నారాయణ, వీరభద్రపురం రాజు, కుక్కల దైబు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్.. చంద్రబాబు జేబు సంస్థా..?

డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ


విలేకర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చిత్రంలో నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

తాడేపల్లిగూడెం: స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఎన్నికలలో అవాంఛనీయ చర్యలను నియంత్రించాల్సిన ఎన్నికల కమిషన్.. ప్రజలు సిగ్గుపడేలా, హాస్యాస్పదంగా వ్యవహరిస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ అంటే చంద్రబాబు జేబు సంస్థా అనే విధంగా చర్యలున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న విద్యాదీవెన, రైతులకు విత్తనాల సరఫరా వంటి వాటిని అమలు చేయకుండా ఉండటం వివిధ వర్గాలకు నష్టం కలిగించే చర్య అని అన్నారు. తెలంగాణలో అడ్డం రాని ఆంక్షలు ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు వస్తున్నాయన్నారు. సకాలంలో రైతులకు విత్తనాలు సరఫరా చేయకుంటే వారు నారుమళ్లు ఎలా వేసుకుంటారు.. ఇదేమి ఎన్నికల హామీ కాదు కదా అని ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం బాబుకు ఇష్టం ఉండదని కొట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యమా, చంద్రబాబు స్వామ్యమా అని ప్రశ్నించారు. మోదీ, చంద్రబాబు వదిన పురందేశ్వరి చెప్పిన విధంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమిని ఘోరంగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం పాల్గొన్నారు.

జగన్ గెలుపును ఆపలేరు

ఎన్నికల కమిషన్ తదితర వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూసినా, ఎవ్వరూ ఎన్నిరకాలుగా కుట్రలు పన్నినా జగన్ గెలుపును ఆపలేరని గూడూరి ఉమాబాల అన్నారు. కూటమి పార్టీలు ప్రజలకు చెడు చేస్తూ జగన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలనుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో కూటమికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

చంద్రబాబు కనుసన్నల్లో ఈసీ నడుస్తోంది

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుగొండ: రాష్ట్రంలో ఎన్నికల కమిషన్.. చంద్రబాబు కమిషన్‌గా విధులు నిర్వహిస్తున్నట్టు ప్రజలకు అనుమానాలు కలుగుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్డీయే కూటమిలో చేరిన తర్వాత ఎన్నికల కమిషన్ లేనిపోని నిబంధనలు పెడుతోందన్నారు. ఎక్కడా లేని నిర్ణయాలు రాష్ట్రంలో అమలు చేస్తూ ఎలక్షన్ కమిషన్ చంద్రబాబుకు ఒక తొత్తులా.. వారి కనుసన్నల్లో పనిచేస్తోందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రావలసిన విద్యాదీవెన సుమారు రూ.610 కోట్లు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.847 కోట్లు వారి ఖాతాల్లో జమ కాకుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఇవి కొత్తగా పెట్టిన పథకాలు కావని, రాష్ట్రంలో ఐదేళ్లుగా అమలు చేస్తున్న వేనని గుర్తుచేశారు. ఎన్నికల కమిషన్ పునరాలోచించుకుని విద్యార్థులకు, రైతులకు న్యాయం చేసే విధంగా నిధులను విడుదల చేయాలని, ఈమేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆదేశాలు ఇవ్వాలని శ్రీరంగనాథరాజు కోరారు.

ఈసీది పక్షపాత వైఖరి

కొయ్యలగూడెం: ఎలక్షన్ కమిషన్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన పక్షపాత వైఖరి అవలంభిస్తుందని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో తెలంగాణలో అనుమతించిన ఈసీ ఆంధ్రప్రదేశ్‌లో అనుమతించకపోవడం అన్యాయం అన్నారు. 2019వ సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజు ముందు వరకు పసుపు కుంకుమ పథకం పేరిట పదివేల రూపాయలు జమ చేయడం జరిగిందని. ఇప్పుడు రైతులను ఆదుకునే విషయంలో ఈసీ అడ్డుపడుతోందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన సొమ్ములు కూడా జమ కాకపోవడంతో తల్లిదండ్రులు వేదన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేస్తున్న ప్రక్రియ అనుమానాలకు తావిస్తోందని, ఈసీ వెనుక ఎవరు ఉన్నారనేది ప్రజలందరికీ అర్థమవుతోందని అన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఆంక్షలు విధిస్తున్న ఈసీ నిర్ణయాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారని ఈ విషయంలో రాష్ట్రపతి కలగచేసుకొని రైతులకు విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఇది రాజ్యాంగ విరుద్ధం

చెల్లెం ఆనందప్రకాష్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు



పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఎప్పటి నుంచో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేయడం రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. యాళ్లవానిగరువులో తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాదీవెన, విద్యా వసతి పథకాలను ఆపడం సరికాదన్నారు. దీని వల్ల దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎందరో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడం, కళాశాలలు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, దీంతో విద్యార్థుల నుంచి ప్రతి రోజు ఎస్సీ కమిషన్‌కి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాలనలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోరాదన్నారు. ఎస్సీ కమిషన్ కూడా రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సంస్థే అని చెప్పారు. ఎన్నికల కమిషన్ చర్యలు చూస్తుంటే కేంద్రానికి కొమ్ముకాస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. ప్రతిపక్షం వారు ఫిర్యాదు చేస్తే చాలు విచారణ లేకుండా డీజీపీని, పరిపాలనాధికారులను మార్చడం చూస్తుంటే రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని అర్థమవుతుందన్నారు. తెలంగాణలో రైతు భరోసా అమలు చేస్తున్నారని.. అక్కడ లేని నిబంధనలు ఏపీలో ఎందుకు అని ప్రశ్నించారు.

మా గుండెల్లో కొలిచేనేత ఆయన

- నవ్వులు పంచిన నవరత్నాలు
- ఒకప్పుడు భారంగా జీవనం
- ఆశపు ఇంట సంతోషాల సిరులు



గతమెంతో 'హీనం'

ఇక్కడ మగ్గం దగ్గర కనిపిస్తున్న పెద్దావిడ పేరు ఆశపు భ్రమరాంబ. చిన్నప్పటి నుంచి నేత చేసుకోవడం పదీ.. పరకా సంపాదించుకోవడం ఒకటే తెలుసు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పట్టణం వీవర్స్ కాలనీకి చెందిన సూర్యచంద్రరావుతో పెళ్లయింది. భర్త కూడా నేత కార్మికుడే. పెళ్లయినప్పటి నుంచి భర్తతో కలసి వీవర్స్‌కాలనీలో మగ్గంపైనే కష్టపడుతూ జీవనం సాగించేది. వీరి కుమారుడు నాగరాజు, కోడలు శాంతకుమారి కూడా నేత కార్మికులే. అయితే చేనేత ప్రాభవం బాగా ఉన్న రోజుల్లో వీరికి పెద్దగా ఆర్థికంగా ఒడిదుడుకులు ఉండేవి కాదు. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరి జీవనం మరీ దుర్భరంగా మారింది. నేత కార్మికులకు, మగ్గందారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడం, ఆరుగాలం మగ్గంపై శ్రమించినా సరైన ఆదాయం లేకపోవడంతో కొన్ని నెలలు మగ్గం మూసేసి వేరే పనులు కూడా చేసుకున్నారు. ఈ బతుకు ఎందుకూ అనిపించేది.

దశ తిరిగింది

2019 తర్వాత బతుకుపై 'ఆశపు'ట్టే

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేనేతదారుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు భ్రమరాంబ కుటుంబానికి కలిసి వచ్చాయి. సంక్షేమ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు నవ్వులు పంచాయి. దీంతో మూలన పడిన మగ్గం మళ్లీ పరిగెత్తడం ప్రారంభించింది. ఆ ఇంట్లో మగ్గాల సంఖ్య రెండుకు చేరాయి. ప్రస్తుతం భ్రమరాంబ ఆమె భర్తతోపాటు కొడుకు నాగరాజు, కోడలు శాంతికుమారి అంతా మగ్గాలపై చీరలు నేస్తున్నారు. 5 దఫాలుగా ఆ కుటుంబానికి వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా రూ.2.40 లక్షలు వచ్చాయి. భ్రమరాంబ భర్త చంద్రరావుకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. కోడలు శాంతకుమారికి వైఎస్సార్ చేయూత పథకంలో ఏడాదికి రూ.18,750 చొప్పున రూ.56,250 వచ్చింది. నాగరాజు శాంతకుమారి దంపతులకు 5వ తరగతి, 6వ తరగతి చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో ఒకరికి అమ్మఒడి పథకంలో ఈ 5 ఏళ్లలో రూ.80 వేలు జమయ్యాయి. ఇక భ్రమరాంబతో పాటు కోడలు శాంతకుమారి ఇద్దరికి కూడా పట్టణంలో జగనన్న కాలనీలో ఇళ్లస్థలాలు ఇచ్చారు. ఈ రెండు స్థలాలు కలిపి రూ.15–17 లక్షలు విలువ చేస్తాయి. ఇలా ఈ ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి పథకాల రూపంలో వచ్చిన సహాయం మొత్తం సమారు రూ.20 లక్షలకు చేరింది. దీంతో ఆ కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఇప్పుడు అందరూ ఆనందంగా జీవిస్తున్నారు. ఇదంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యం వల్లే సాధ్యమైందని, మేం నిత్యం కొలిచే నేత ఆయన అని ఆ కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోంది.

- నరసాపురం

సంక్షేమం సగం బలం

చిన్న కుటుంబానికి కొండంత మేలు

పథకాల ద్వారా ఇంటిల్లిపాదికీ లబ్ధి

రూ.రెండున్నర లక్షలకుపైగా సాయం


చినతాడేపల్లిలోని దూలపల్లి సుబ్బారావు కుటుంబం

2014-19 మధ్య..

వయస్సు మీద పడుతున్నా.. కుటుంబం కాడిని బలవంతాన భుజానికెత్తుకుని లాగాల్సిన స్థితి. చింతలున్న చిన్న కుటుంబమమే అయినా, ఆశలను వాయిదా వేసుకోవాలి. ఉన్న కాడికి నాలుగు మెతుకులు తిని, నీడ పట్టున కునుకు తీద్దామనుకొనే లోగా, కష్టాల స్వప్నాలు నిద్రాభంగం కలిగించేవి. ఉన్న ఒక్క బిడ్డ చిన్న ప్రైవేటు ఉద్యోగి. బిడ్డ తెచ్చే నాలుగు రూపాయలు వేన్నీళ్లకు చన్నీళ్లుగా మాత్రమే ఉపయోగపడేవి. వృద్ధాప్య పింఛన్ పొందే అర్హత ఉన్నా, గ్రామంలో ఎవరైనా చనిపోతే చెప్పు, జన్మభూమి కమిటీతో చెప్పించుకో పింఛన్ వస్తుందనే పచ్చనాయకుల ఉచిత సలహాలు. ఐదేళ్ల క్రితం వరకు ఇదే తీరు. రెక్కల కష్టాన్ని నమ్ముకొని గౌరవంగా కుటుంబాన్ని ఈడ్చుకొస్తున్న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలోని దూలపల్లి సుబ్బారావు కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ వరాల రేడుగా మారారు.

దశ తిరిగింది

2019 తర్వాత..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దూలపల్లి సుబ్బారావుకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. నాలుగేళ్ల నుంచి ఠంచన్‌గా ఒకటో తేదీనే వస్తోంది. ఇప్పటివరకు లక్ష రూపాయలకుపైగా అందింది. సుబ్బారావు కుమారుడు జయరాజు ఒక ప్రైవేటు స్కూలులో పనిచేస్తున్నాడు. అతనికి కిడ్నీలో రాళ్లు ఏర్పడటంతో ఆరోగ్యశ్రీలో సుమారు రూ.40 వేలు ఖరీదైన చికిత్స చేశారు. సుబ్బారావు కోడలిగా వచ్చిన సుమలత పదో తరగతి వరకు చదువుకున్నారు. టైలరింగ్ వచ్చు. చేయూత ద్వారా ఆమెకు ఇప్పటివరకు రూ.30 వేల లబ్ధి కలిగింది. ఆమె కూతురు సుజన, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియంలో ఆరో తరగతి చదువుతోంది. అమ్మఒడి ద్వారా ఇప్పటికి నాలుగు విడతల్లో రూ.53 వేల వరకు లబ్ధి చేకూరింది. సుజన తమ్ముడు శ్రవణ సుజిత్ ఎల్‌కేజీ చదువుతున్నాడు. సుమలత డ్వాక్రా సంఘంలో కూడా సభ్యురాలిగా ఉండటంతో ఆమెకు ఆసరా ద్వారా ఇప్పటి వరకు రూ.41,200 వరకు ప్రయోజనం చేకూరింది. మొత్తంగా ఆ కుటుంబానికి రూ.2.60 లక్షల వరకు మేలు జరిగింది. దీంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. దేవుడిచ్చిన సీఎం జగన్‌బాబు అంటూ సుబ్బారావు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- తాడేపల్లిగూడెం